కథా నిలయం
6039
శ్రీకాకుళం

వెంటనే ఆ ఇద్దరూ కృతజ్ఞత నిండిన హృదయాలతో, కళ్ళ నీళ్ళతో మోకాళ్ళ మీద కూర్చుని దేవుడ్ని ప్రార్థించారు.

ఆ ఓడ పేరు టైటానిక్!

## 11. కమింగ్ టు హైద్రాబాద్

హైద్రాబాద్‌లో ఉద్యోగం సంపాదించాలనుకుని పంతొమ్మిదేళ్ళ రంగనాధ్ పొన్నూరు నుండి రైల్లో బయలుదేరాడు. హైద్రాబాద్‌లో పరిచయస్థులెవరూ లేకపోవడంతో అతనికి మనసులో భయంగా వుంది.

రైలు వరంగల్ స్టేషన్‌కి వచ్చాక భోజనం చేద్దామని జేబులో చెయ్యి పెడితే పర్సు లేదు. దాన్ని ఎవరో కొట్టేసారని, తన దగ్గరి డబ్బంతా పోయిందని గ్రహించాడు రంగనాధ్. ఆ సంగతి అందరికీ తెలిసింది.

"ఎక్కడికి?" అతని ఎదురుగా కూర్చున్నాయన ప్రశ్నించాడు.

"హైద్రాబాద్‌కి. ఉద్యోగం కోసం."

"నా మనవడు వల్లభరావు హైద్రాబాద్‌లోనే 'మోడ్రన్ డ్రస్ ఫేక్టరీ'లో పని చేస్తున్నాడు. వాడ్ని కలిసి నా పేరు చెప్పు. నీకు సహాయం చేస్తాడు."

రంగనాధ్ ఆ వివరాలు రాసుకున్నాడు. ఖాజీపేటలో దిగబోతూ ఆయన చెప్పాడు.

"భయపడక. అన్నిటికీ దేవుడే వున్నాడు. ఆయన్ని నమ్ముకో చాలు."

రంగనాధ్ రైలు దిగి మోడ్రన్ డ్రస్ ఫేక్టరీ గురించి ఎంతమందిని అడిగినా ఎవరూ అదెక్కడుందో చెప్పలేకపోయారు. చివరికి అలసిపోయిన రంగనాధ్, తాళం వేసి వున్న ఓ గది ముందు నడుం వాల్చాడు.

వెంటనే నిద్ర పట్టేసింది.

చీకటి పడుతుండగా ఎవరో అతన్ని కుదుపుతూ లేపారు. అతను అరుస్తుండటంతో రంగనాధ్‌కి మెలకువ వచ్చింది.

"ఏ ఊరు మనది? ఇక్కడ పడుకున్నావేమిటి? ఎవరూ లేరా నీకు?"

"మోడ్రన్ డ్రస్ ఫేక్టరీలో పనిచేసే వల్లభరావు తప్ప ఈ వూళ్ళో ఇంకెవరూ లేరు నాకు." చెప్పాడు రంగనాథ్.

"వల్లభరావెవరు?"

రైల్లో జరిగిందంతా చెప్పాడతను.

అతను చిన్నగా నవ్వి రంగనాథ్‌ని తన గదిలోకి ఆహ్వానించాడు. మర్నాడు అతన్ని తను పని చేసే ఫేక్టరీకి తీసుకెళ్ళాడు. రంగనాథ్‌ని మేనేజర్‌కి సహాయకుడిగా తీసుకున్నాడు అతను.

రంగనాథ్ పడుకున్నది హైద్రాబాద్‌లోని కొన్ని లక్షల ఇళ్ళల్లో ఒకటైన వల్లభరావు ఇంటి ముందే అని ఈపాటికి అర్థమై ఉండవచ్చు!

లోకంలో ఏదీ కాకతాళీయంగా జరగదు. తనని నమ్ముకున్నవారికి దేవుడు చేసే సహాయానికి మనం పెట్టుకున్న పేరు కాకతాళీయం.

## 12. నిజమైన నమ్మకం

ఓ దేశంలో రెండేళ్ళుగా వర్షాలు లేవు. మూడో ఏడు కూడా వర్షాలు కురవక క్షామం ఏర్పడింది. ఆ దేశపు రాజు మంత్రులని పిలిచి వర్షాలు కురవడానికి ఏంచేయాలా అని ఆలోచించి, తమ దేశంలోని ఓ పెద్ద పీఠాధిపతి వద్దకి వెళ్ళి తమ సమస్యని విన్నవించుకున్నాడు. ఆయన కొద్దిసేపు ధ్యానంలోకి వెళ్ళొచ్చాక చెప్పాడు.

"మన దేశంలోని ప్రజలకి దైవంమీద నమ్మకం తగ్గడం వల్లనే ఇలా జరుగుతోంది. అంతా దైవ భక్తిని పెంపొందించుకోవాలి. దైవం ఉనికి మీద ప్రజలందరికీ నమ్మకం ఏర్పడాలి. అప్పుడు వర్షాలు బాగా కురిసి క్షామం పోతుంది."

"కానీ, ప్రజలందరిలో దైవభక్తిని తక్కువ కాలంలో పెంపొందించడం అసాధ్యం. కాబట్టి మీరే ఏదైనా పరిష్కారాన్ని సూచించండి." కోరాడు రాజు.

ఆయన ఆలోచించి చెప్పాడు.